సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 29 । మార్చి । 2024

I



ప్రత్యేక అవసరాల పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని డీఈఓ, సమగ్రశిక్ష జిల్లా పీఓ పిలుపునిచ్చారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
కడప	: 6.30	4.58
పులివెందుల	: 6.33	4.53
ప్రొద్దుటూరు	: 6.32	5.02

గరిష్టం/కనిష్టం
41.2/24.8

వాతావరణం

జిల్లాలో గురువారం 24.8 – 41.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

▶▶ వైఎస్సార్‌సీపీలోకి జమీల్



టీడీపీ నేతలు జమీల్, హీనాలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి

కడప కార్పొరేషన్: కడప అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు జమీల్, హీనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం రాత్రి వారు ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి వారిని ఆప్యాయంగా పలకరించి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జమీల్, హీనా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరుకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీలో జోష్!

- వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసల పర్వం
- కమలాపురం నియోజకవర్గం నుంచి సాయినాథ్‌శర్మ
- పులివెందులలో సతీష్‌కుమార్‌రెడ్డి
- కడపలో మైనార్టీ నేతలు జమీల్ తదితరులు
- ఇంకా పలు నియోజకవర్గాల్లో పార్టీలో చేరుతున్న నాయకులు
- నేతల రాకతో వైఎస్సార్‌సీపీలో కొత్త ఉత్సాహం



సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ నూతనోత్సాహంతో ముందుకు సాగుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల అభ్యర్థుల ఎంపిక మొదలు ప్రచారం వరకు అన్ని విషయాల్లోనూ ఆ పార్టీ వేగంగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు ఆ పార్టీలో ఇమడలేక గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకుంటున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీలో జోష్ కనిపిస్తుండగా, తెలుగుదేశం పార్టీ నేతల నిష్క్రమణతో సతమతమవుతోంది. ఒకప్పుడు పులివెందుల నియోజకవర్గంలో స్వయంగా వైఎస్ రాజశేఖరరెడ్డిపై పోటీ చేసిన టీడీపీ నేత ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డిని ఇటీవల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో పులివెందుల నియోజకవర్గంలో జగన్ మెజార్టీ లక్షల్లో ఉంటుందని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరోవైపు కమలాపురం నియోజకవర్గంలో అనేక ఏళ్లపాటు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ ఆ పార్టీలో రాష్ట్రస్థాయి పదవుల్లో సైతం కొనసాగిన నాయకుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడు సాయినాథ్ శర్మ కూడా తాజాగా ఆళ్లగడ్డలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన రాకతో పార్టీకి కొత్త ఊపు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మాజీ ఎంపీపీ మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి, చాపాడు మండలంలో రవిశంకర్‌రెడ్డి కూడా సీఎం సమక్షంలో పార్టీలో చేరారు. ప్రతి చోటా పార్టీలో చేరే వారి సంఖ్య పెరుగుతుండటంతో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

▶▶ చాపాడులో గట్టి దెబ్బ



వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రవిశంకర్‌రెడ్డి, పక్కనే ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు: మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలో టీడీపీకి గట్టి దెబ్బ తగిలింది. మండలంలోని టీఓపల్లె గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు లింగిరెడ్డి రవిశంకర్‌రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రొద్దుటూరులో బుధవారం రాత్రి జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువా వేసి రవిశంకర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జగన్ పరిపాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు.

▶▶ నాడు తండ్రితో పోటీ.. నేడు తనయుడితో భేటీ



ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి

వేంపల్లి: ఇటీవల శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సింగారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి రాకతో వైఎస్సార్‌సీపీలో రెట్టింపు ఉత్సాహం మొదలైంది. 27ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేత, 6సార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా, ఎమ్మెల్సీగా, శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా పనిచేసిన ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి నాలుగేళ్ల క్రితం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి రాజకీయాలకు దూరంగా మెలిగారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీలో చేరారు. స్వయానా ముఖ్యమంత్రి విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి ఆయనకు పార్టీ కండువా కప్పారు. టీడీపీ అభ్యర్థిగా నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రత్యర్థిగా నిలబడిన ఆయన నేడు తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దోస్తీ చేయడం విశేషం. నియోజకవర్గంలో పులివెందుల తర్వాత అత్యధిక ఓట్లు కలిగిన ప్రాంతం వేంపల్లె. ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి స్థానిక నేత కావడం..ఇతర మండలాల్లో సతీష్‌రెడ్డి అనుచరులు, అభిమానులు ఉన్నారు. గత ఎన్నికల్లో 33 వేలు పైచిలుకు ఓట్లు సతీష్‌రెడ్డికి పడ్డాయి. సీఎం జగన్‌కు దాదాపు 98 వేలు ఓట్లు పడ్డాయి. దీంతో వీరిద్దరి కలయికతో ఈసారి ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లక్షకుపైగా మెజారిటీ వస్తుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

▶▶ కమలాపురంలో టీడీపీకి షాక్



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన సాయినాథ్ శర్మ, చిత్రంలో ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్

కమలాపురం: కమలాపురం నియోజకవర్గంలో టీడీపీకి పెద్ద షాక్ తగిలింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డికి ముఖ్య అనుచరునిగా కొనసాగుతున్న సాయినాథ్‌శర్మ గత కొంత కాలంగా ఆయనతో విభేదిస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆయన వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా గురువారం ఆళ్లగడ్డలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో సాయినాథ్ శర్మ, ఆయన తనయుడు మణికంఠ శర్మ వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంచి అనుచరగణం ఉన్న సాయినాథ్ శర్మ వైఎస్సార్‌సీపీలో చేరడంతో పార్టీకి మంచి జోష్ వచ్చినట్లు అయింది.

పుత్తాతో విభేదం..

సాయినాథ్‌శర్మ దాదాపు 20 ఏళ్లకు పైగా పుత్తాకు అనుచరునిగా కొనసాగుతున్నారు. అయితే కొంత కాలంగా పుత్తాతో శర్మ విభేదిస్తూ వచ్చారు. ఈ మధ్య అంతరం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తదితరులు సాయినాథ్ శర్మ ఇంటికి వెళ్లి తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు.దీంతో ఆయన పార్టీలో చేరారు.

చంద్రబాబుకు నిజాయితీగా పనిచేసేవారంటే నచ్చదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాయినాథ్ శర్మ, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్: టీడీపీ అధినేత చంద్రబాబుకు నిజాయితీగా పనిచేసేవారు నచ్చరని, యాక్టింగ్ చేసే వారే నచ్చుతారని టీడీపీ మాజీ నేతలు సాయినాథ్ శర్మ, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేసిన తమను అగౌరవపరిచి, అవమానకర రీతిలో బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆళ్లగడ్డ వద్ద వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఆ తర్వాత కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాయినాథ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశం పార్టీని బతికించడానికి తాము శతవిధాలుగా కృషి చేశామని, ఎన్నో కేసులు కూడా పెట్టించుకున్నామన్నారు. ఎన్ని చేసినా తమకు అన్యాయం చేశారన్నారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మన జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి శాయశక్తులా పనిచేస్తామన్నారు. రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌ను కలిసిన వెంటనే ఆయన తమను సాదరంగా ఆహ్వానించి ' అన్నా.. మీ గురించి మంచిగా విన్నాం, మీకు న్యాయం చేస్తాం.. చెప్పుడు మాటలు విని పార్టీ నుంచి బయటకు పంపే సంస్కృతి తమ పార్టీలో లేదని చెప్పారన్నారు. వైఎస్ కుటుంబంపై ఉన్న నమ్మకంతోనే బేషరతుగా పార్టీలో చేరానని పేర్కొన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ కె. సురేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్యలపై కాల్ సెంటర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వాటి పరిష్కారం కోసం కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తితే 9100 12 2302 నెంబరుకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పది పరీక్షలకు 4952 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి గురువారం నిర్వహించిన ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్–2, కాంపోజిట్ కోర్సు, సంస్కృతం, అరబిక్ పర్షియన్ పరీక్షలకు 70 పరీక్షా కేంద్రాల్లో 4952 మంది హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించామని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: కాచిగూడ–చెంగల్పట్టు మధ్య నడుస్తున్న చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు వారంలో మూడు రోజులు కాచిగూడ నుంచి పుదుచ్చేరికి ఆది, బుధ, గురు వారాల్లో, పుదుచ్చేరి నుంచి కాచిగూడకు సోమ, గురు, శుక్ర వారాల్లో నడుస్తుందన్నారు. వేల్మరువత్తూరు, విల్లుపురం, పుదుచ్చేరి స్టేషన్లలో ఈ రైలు ఆగుతుందన్నారు. ప్రస్తుతం ఈ రైలు 17651/17652 నంబర్ల పేరుతో నడుస్తోందని, జులై 8వ తేదీ నుంచి 17653/17654గా మార్పు చేస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని ఆయన సూచించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



మునగా సతీష్, జీఎస్టీ లక్ష్మణ్‌రావు, టి.నాగేంద్ర

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మునగా సతీష్ కుమార్, వైస్ చైర్మన్లుగా జీఎస్టీ లక్ష్మణ్‌రావు, తలుపుల నాగేంద్రలను ఎంపిక చేశారు. వీరు ముగ్గురు ఈనెల 31వ తేదీ ఆదివారం చిన్నచౌకులోని ఆదిత్య కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మేమంతా సిద్ధం సభ విజయవంతంపై ఎంపీ కృతజ్ఞతలు



పులివెందుల: ప్రొద్దుటూరులో బుధవారం జరిగిన మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇడుపులపాయ నుంచి మొదలైన మేమంతా సిద్ధం కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారన్నారు. దారిపొడవునా ప్రజలు బారులు తీరి జగనన్నకు మద్దతు తెలిపారన్నారు. అలాగే ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

గండిలో హుండీల ఆదాయం లెక్కింపు



గండి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ శాఖ అధికారులు చేపట్టారు. ఆలయంలోని హుండీల ద్వారా రు.9,89,197 లు, అన్నదాన సత్రంలోని హుండీల ద్వారా రు.11,619లు వెరసి రు.10,00,816లు ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, దేవదాయ శాఖ పర్యవేక్షకుడు ప్రసాదరావు, ఆలయ ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్ ,రాజగోపాలాచార్యులు, చక్రాయపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కనుల పండువగా శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండుగగా జరిగింది. గురువారం స్వాతి నక్షత్రం కావడం , ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు.

ప్రత్యేక ఓటర్లకు సదుపాయాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సాధారణ ఎన్నికల ఓటింగ్ సమయంలో ప్రత్యేక కేటగిరీకి చెందిన దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జండర్ ఓటర్లకు అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, విజయరామరాజు రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఎక్కడా ఎంసీసీ ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2035 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏప్రిల్ 5వ తేదీ లోపు అన్నిరకాల ఏర్పాట్లను సంబంధిత ఏఆర్వోల ద్వారా సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టాయిలెట్లు, తాగునీరు, రవాణా, షామియానాలు, పార్కింగ్ ప్లేస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డులను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కొన్ని కుర్చీలు, వీల్ చైర్లు, హ్యాండ్ హోల్డ్ వాకింగ్ ర్యాంపుల సదుపాయాలు కల్పించాలన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి మంచానికి పరిమితమైన, 85 ఏళ్లు దాటిన వారి, విభిన్న ప్రతిభావంతులైన ఓటర్ల డేటా త్వరగా సేకరించాలన్నారు.

ఫలితం.. త్వరితం!

- ముగిసిన పదో తరగతి పరీక్షలు
- జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు ముమ్మరం
- సిబ్బంది నియామకం పూర్తి
- ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూల్యాంకనం



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన ప్రభుత్వం మరో ఘట్టంలోకి అడుగుపెడుతోంది. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు రాసిన సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించిన మూల్యాంకన కార్యక్రమాన్ని కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ మూల్యాంకన కార్యక్రమం ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జరగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్షన్నర పేపర్లు మూల్యాంకనానికి రానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1122 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీరిలో మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతోపాటు వాటిని పరిశీలించేందుకు చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ క్యాంపు ఆఫీసర్గా, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. అలాగే మరో ఏడుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా ఉంటారు.

ముగ్గురు ఏఈలకు ఒక సీఈ, స్పెషల్ అసిస్టెంట్

విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకనం నిర్వహించేందుకు ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లను(ఏఈ) ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్(సీఈ)తో పాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కొక్క ఏఈ రోజుకు 40 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఏఈలు మూల్యాంకనం చేసి పత్రాలను సీఈలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలు సరైనవి, కానివి పరిశీలించి వేసిన మార్కులను నిశిత పరిశీలన చేస్తారు. అదే విధంగా జవాబు పత్రాల్లో ఏఈలు వేసిన మార్కులను కూడి టోటల్ మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు. ఈ విధంగా ఒక బృందం రోజుకు 120 సమాధాన పత్రాలను మూల్యాంకనం జరిపి మార్కులు వేయడంతో పాటు వేసిన మార్కులు సరిగా ఉన్నవి, లేనివి క్షుణ్ణం తనిఖీ చేస్తారు. క్యాంపు అధికారికి సహాయకులుగా సహాయ క్యాంపు అధికారులను నియమిస్తారు. సీనియర్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు మూల్యాంకన విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిసెంట్లుగా వ్యవహరించనున్నారు.

1122 మంది సిబ్బంది నియామకం

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రానున్న దాదాపు 1,50,000 పేపర్లను మూల్యాంకనం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1122 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో చీఫ్ ఎగ్జామినర్లుగా 100 మందిని, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 583 మందిని, స్పెషల్ అసిస్టెంట్లుగా 439 మందిని ఇలా మొత్తంగా మూల్యాంకన విధులకు 1122 మందిని నియమించారు. ఈ మూల్యాంకనాన్ని ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాటు చేసింది. ఈమేరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

▶▶ పక్కాగా నిబంధనలు అమలు

పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. గుర్తింపు కార్డు ఉన్న వారినే ఆ ప్రాంతంలోకి అనుమతించనున్నారు. మూల్యాంకనం జరుగుతున్న అన్ని రోజులు అటు వైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను వెంట తీసుకెళ్లడానికి వీలు లేకుండా నిబంధనలను జారీ చేయనున్నారు. విధులకు కేటాయించిన సిబ్బంది ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు మూల్యాంకన కేంద్రంలో ఉండాల్సి ఉంది. సిబ్బందికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు.

పటిష్ట ఏర్పాట్లు



ఏప్రిల్ 1నుంచి నిర్వహించనున్న పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నాము. మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి అవసరమైన తాగునీరు, గదుల్లో లైటింగ్‌తో పాటు ఫ్యాన్లు, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నాము. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కనుక సిబ్బంది చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మార్కులు వేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

– మర్రెడ్డి అనురాధ, డీఈఓ

సెలవు దినాల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం

కడప కార్పొరేషన్: ఈనెల 29, 31 తేదీల్లో సెలవు దినాలైనప్పటికీ వినియోగదారుల సౌకర్యం కోసం విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ గుడ్ ఫ్రైడే, 31వ తేదీ ఆదివారం రోజుల్లో కూడా వినియోగదారులు తమ బిల్లులను చెల్లించి సంస్థ ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

ఉపాధి కూలీ పెంపు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా వివిధ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సగటు వేతనం పెరిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన వేతనం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లాలో మరింత బడ్జెట్ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం సగటు వేతనం రూ. 272 ఉండగా రూ. 28లుగా పెరిగి మొత్తం రూ. 300కు చేరింది. దీంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో జిల్లాలో 1,96,277 మంది కూలీలకు మేలు జరగనుంది.

క్లుప్తంగా

పొలతలలో హుండీ కానుకలు లెక్కింపు



పొలతలలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీల ఆదాయాన్ని గురువారం దేవాదాయశాఖ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ కానుకలను లెక్కించగా రూ.30,75,482 లక్షలు నగదు లభించిందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నాగమల్లారెడ్డి, ఆలయ ఈఓ శ్రీనువాసులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నాటు సారా బెల్లం ఊట ధ్వంసం

కొండాపురం : మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామ సమీపంలో గురువారం నాటు సారా తయారు చేసేందుకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె. చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. స్థానికుల సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి నాటు సారా తయారు చేస్తున్న బెల్లం ఊటను ఎస్‌బి కానిస్టేబుల్ శివ, కానిస్టేబుల్ నరసింహాలతో వెళ్లి ధ్వంసం చేశామన్నారు. ఎవరైనా సరే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు

వ్యక్తి ఆత్మహత్య



సునీల్‌కుమార్ మృతదేహం

లింగాల : లింగాల మండలం దొడ్లవ గ్రామానికి చెందిన తుమ్మలూరు సునీల్ కుమార్ రెడ్డి (30) అనే వ్యక్తి గురువారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ బీవీ కృష్ణయ్య వివరాల మేరకు....సునీల్ కుమార్ రెడ్డి గత ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేవాడని తెలిపారు. కడుపు నొప్పి తాళలేక ఆయన ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

లింగాల : లింగాల మండలం అంబకపల్లి గ్రామ సమీపంలోని ముదిగుబ్బ క్రాస్ రోడ్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ వద్ద గురువారం ఎస్సై బీవీ కృష్ణయ్య సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో బొలెరో వాహనంలో వస్తున్న ఆరు మందిని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా వారి వద్దగల రూ. 6,24,000 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదేవిధంగా మురారిచింతలకు చెందిన వ్యక్తి ముదిగుబ్బ నుంచి ద్విచక్ర వాహనంలో అంబకపల్లె వస్తుండగా తనిఖీలు నిర్వహించి అతని వద్దగల రూ. 94 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చరిత్రహీనుడు చంద్రబాబు

- ఊసరవెల్లిని మించిపోయేలా రంగులు మార్చగల ఘనుడు
- టీడీపీ, జనసేన, బీజేపీలకు బీ ఫారాలు ఇస్తున్నది ఆయనే
- బస్సుయాత్ర సూపర్ సక్సెస్ అయితే అవాస్తవాలు రాయడం దారుణం
- తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : గోబెల్స్‌ను తలదన్నేలా అవాస్తవాలు ప్రచారం చేయడంలో ప్రతిపక్షనేత చంద్రబాబును మించిన వారు లేరని, పద్నాలుగున్నరేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఇది చేశానని చెప్పుకోలేని చరిత్రహీనుడని కమలాపురం శాసన సభ్యులు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం కడపలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ప్రొద్దుటూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ తుస్సుమనిందని కొన్ని పచ్చ పత్రికలు, పచ్చ ఛానెళ్లలో ప్రచారం చేయడం దారుణమన్నారు. రాహుకాలం ఉండటం వల్ల బస్సుయాత్ర 1.30 గంటలకు ఇడుపులపాయ నుంచి బయలుదేరిందని, ప్రొద్దుటూరులో 4 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ సుమారు 3 గంటలు ఆలస్యంగా మొదలయ్యిందన్నారు. ప్రతి గ్రామంలో జనం తండోపతండాలుగా తరలివచ్చి సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డికి ఆహ్వానం పలికారన్నారు. దివంగత ఎన్‌టీఆర్ పార్టీ పెట్టినప్పుడు, వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర చేపట్టినప్పుడు కంటే ఎక్కువగా జనం వచ్చారని, బస్సుయాత్ర సూపర్ సక్సెస్ అయ్యిందన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో వైఎస్సార్‌సీపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. వైఎస్ జగన్ కడప ఎంపీ టికెట్‌ను అవినాష్‌రెడ్డికే ఖరారు చేశారని, అవినాష్‌రెడ్డికి మద్దతుగా వైఎస్ వివేకానందరెడ్డి ప్రచారం కూడా చేశారని గుర్తుచేశారు. హత్య కంటే ముందు ఏం జరిగిందనేది తెలియకుండా అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, ఇంటెలిజెన్స్ డీజీ వెంకటేశ్వరరావు మాఫీ చేశారన్నారు. వివేకాను కిరాతకంగా చంపిన విషయాన్ని దస్తగిరి పూసగుచ్చినట్లు చెప్పిన తర్వాత కూడా అతనికి బెయిల్ రావడానికి సహకరించింది ఎవరో అందరికీ తెలుసన్నారు. ఆ హత్యను వైఎస్సార్‌సీపీకి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నది కూడా బాబేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రాయలసీమకు ఎక్కడా అన్యాయం జరగలేదని, గండికోటలో, తెలుగుగంగలో నీటిని నిల్వ చేసిన ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా, బయట, లోపల పొత్తులు పెట్టుకోవడం ఒక్క చంద్రబాబుకే తెలుసన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు బీ ఫారాలు ఇస్తున్నది కూడా ఆయనేనని విమర్శించారు. నా పాలనలో మీకు మేలు జరిగి ఉంటేనే ఓటు వేయమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా చెబుతున్నారని, అలా చెప్పే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. 2014లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసే పోటీ చేశాయని, మేనిఫెస్టోలో చెప్పిన అంశాలు ఒక్కటి కూడా అమలు చేయకుండా మోసం చేశారని గుర్తుచేశారు. ఆ పార్టీలు చేస్తున్న విన్యాసాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

చోరీకి గురైన 18 మోటర్‌బైక్‌లు స్వాధీనం



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

ముద్దనూరు : పార్కింగ్ చేసిన మోటర్ బైక్‌లు కనిపిస్తే చాలు అరిగిపోయిన పాత తాళం చెవులను ఉపయోగించి వాటిని దొంగలిస్తారు. ఈ విధంగా మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన అబ్దుల్ బాషా, చిన్న కుళ్ళాయప్ప అనే ఇరువురు కలిసి ఏకంగా 18 మోటర్‌బైక్‌లను దొంగలించారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌తో కలసి డీఎస్పీ డా.టీడీ యశ్వంత్ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ముద్దనూరు రైల్వేస్టేషన్ లో పాయింట్స్‌మెన్‌గా పనిచేస్తున్న జమ్మలమడుగుకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి రైల్వేస్టేషన్ వద్ద షైన్ మోటర్‌బైక్‌ను పార్కింగ్‌చేసి వెళ్లగా అది చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం తాడిపత్రి రహదారిలో సీఐ దస్తగిరి వాహనాలు తనిఖీచేస్తుండగా చోరీకి గురైన షైన్ మోటర్ బైక్‌తో వెళ్తున్న కొర్రపాడు గ్రామానికి చెందిన అబ్దుల్‌బాషా, చిన్న కుళ్ళాయప్పలను పట్టుకుని విచారించారు. సుమారు ఏడాది నుంచి ప్రొద్దుటూరు, కమలాపురం, యర్రగుంట్ల ప్రాంతాల్లో 17 మోటర్‌బైక్‌లనువారు దొంగలించినట్లు విచారణలో వెల్లడైంది. మొత్తం పోలీసులు స్వాధీనం చేసుకున్న 18 బైక్‌ల విలువ సుమారు రూ.16లక్షలు వుంటుందని, ఇరువురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ వివరాలన్నింటినీ ఆన్‌లైన్ చేయాలి

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి జి. భానుమూర్తిరాజు



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు

కడప స్పోర్ట్స్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన విద్యార్థుల వివరాలన్నింటినీ పక్కాగా నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాలన్నింటినీ పొందుపరచాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి జి. భానుమూర్తిరాజు ఆదేశించారు. గురువారం కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కౌట్స్, అండ్ గైడ్స్‌కు సంబంధించిన యూనిట్ల వివరాలు, విద్యార్థుల డేటాను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన వివరాలను మరింత వేగవంతంగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదే విధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న యూనిట్ల వివరాలు, నూతన యూనిట్ల ఏర్పాటు, విద్యార్థుల వివరాలను సేకరించి ఉంచుకోవాలన్నారు. అదే విధంగా గైడ్ కెప్టెన్, స్కౌట్‌మాస్టర్ల శిక్షణకు సంబంధించిన విషయంలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి ప్రవేశ్, ప్రథమ్ సోపాన్, ద్వితీయ సోపాన్, తృతీయ సోపాన్ తదితర కోర్సులకు సంబంధించిన నిర్దిష్ట షెడ్యూలు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. డేటాను పక్కాగా ఉంచుకోవాలని, త్వరలోనే విద్యాశాఖ కమిషనర్ దీనిపై రివ్యూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా అందరం కలిసి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కౌట్ ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఎం. లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి రుణాలు

- ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్ని వర్గాలకు బ్యాంకు రుణాలు
- 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 14,924 కోట్ల రుణ లక్ష్యానికి రూ. 17,100 కోట్లు అందజేత



కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక రకాలైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందజేస్తున్నాయి. గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్బీకేల పరిధిలో బ్యాంకింగ్ కరస్పాండెంట్ల సేవలను విస్తృతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలను మరింత బలోపేతం చేయడం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సూచనలతో బ్యాంకర్లు అటు రైతులకు వ్యవసాయ రుణాలతోపాటు, ఇటు అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పిస్తున్నారు. బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ×స్టాండప్ ఇండియా, ముద్ర, పీఎం స్వనిధి/జగనన్న తోడు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు అందజేశారు. అర్హులైన చేనేతలకు, మత్స్యకారులకు రుణాలు అందించి ఆర్థికంగా చేయూత ఇచ్చారు. అంతేకాకుండా ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను తరచూ నిర్వహించడం జరిగింది. పీఎం కిసాన్ లబ్ధిదారులకు కేసీసి మంజూరుకు సంబంధించి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా పనిచేస్తున్నాయి.

విరివిగా రుణాలు..

బ్యాంకర్లు రుణాలు అందించడంలో వైఎస్సార్ జిల్లాలో లక్ష్యాన్ని అధిగమించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 14,924 కోట్ల రుణ లక్ష్యానికి ఫిబ్రవరి నెలాఖరుకే రూ. 17,100 కోట్ల రుణాలను అందజేశారు. వ్యవసాయ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు, ప్రాధాన్యత రంగాలు, ప్రాధాన్యయేతర రంగాలకు సంబంధించి రుణ లక్ష్యాలను అధిగమించడం జరిగింది. మొత్తం వ్యవసాయ రుణ లక్ష్యం రూ. 9,565 కోట్లు కాగా, రూ. 10,178 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. చిన్న మరియు మధ్యతరగతి పరిశ్రమలకు రుణ లక్ష్యం రూ. 2,045 కోట్లు కాగా, రూ. 2,408 కోట్ల రుణాలు అందజేశారు. అదేవిధంగా ఇతర ప్రాధాన్యత రంగ రుణ లక్ష్యం రూ. 12,647 కోట్లు కాగా, ఫిబ్రవరి నెలాఖరుకు రూ. 13,204 కోట్ల మేర రుణాలు అందించారు. ప్రాధాన్యత లేని రంగాలకు రూ. 2,277 కోట్లు లక్ష్యం కాగా, రూ. 3,885 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేశారు. ఇదిలా ఉండగా పంట రుణాల లక్ష్యం రూ. 6,676 కోట్లకు గాను రూ. 6,394 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ. 1037 కోట్లు రుణాలు అందించాల్సి ఉండగా రూ. 624 కోట్లు అందించారు.

అన్ని వర్గాలకు రుణాలు

అన్ని వర్గాల వారికి ఈ ఏడాదిలో రుణాలు బ్యాంకులు మంజూరు చేసేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా వ్యవసాయం, చిన్న మరియు మధ్య తరగతి పరిశ్రమలు, ఇతర ప్రాధాన్యత రంగాలు, ప్రాధాన్యతలేని రంగాలకు సంబంధించి లక్ష్యానికి మంచి రుణాలు మంజూరు చేశాం. ప్రభుత్వ సూచనలతో బ్యాంకర్లతో ఎప్పటికప్పుడు సమీక్షలతో 2023-24 సంవత్సరానికి రుణ లక్ష్యం అధిగమించేలా చర్యలు తీసుకున్నాం. - ఎల్‌డీఎం దుర్గాప్రసాద్

ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరి



షోరూం యజమానులతో వివరాలు తెలుసుకుంటున్న రవాణాశాఖ అధికారులు

కడప వైఎస్సార్ సర్కిల్ : ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల షోరూం యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు నూతన వాహనాలకు హెచ్‌ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్ బిగించవలసిన బాధ్యత వాహనాలు అమ్మిన షోరూం వారిదేనన్నారు. ఆర్టీఓ మురళి, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు విజయభాస్కర్, ప్రసాద్ , లక్ష్మీ ప్రసన్న , వేణు, నారాయణ నాయక్‌లు కడప, ప్రొద్దుటూరులోని వివిధ షోరూంలను సందర్శించి హెచ్‌ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్ల అమలును పరిశీలించారు. హెచ్‌ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంసీసీ ఉల్లంఘనల అడ్డుకట్టకు ఎంసీఎంసీ

- పెయిడ్ న్యూస్‌పై నిఘా
- రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

కడప సెవెన్‌రోడ్స్ : పార్లమెంటు, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. షెడ్యూల్ నుంచి ఫలితాల ప్రకటన వరకు ఇది అమలులో ఉంటుంది. ఎన్నికల్లో నిష్పక్షపాత మీడియా పాత్రను భారత ఎన్నికల సంఘం ఆశిస్తోంది. పెయిడ్ న్యూస్ ద్వారా విఘాతం కలగకుండా అడ్డుకునేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతోపాటు పెయిడ్ న్యూస్‌ను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు చేపడుతుంది.

- జాతీయ, రాష్ట్ర పార్టీలు, రిజిష్టర్ పార్టీల అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలను ఇచ్చేందుకు మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిష్టర్ కాని పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటనల ప్రసారం కోసం ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు అందిన రెండురోజుల్లోపు ఎంసీఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందురోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతి పొందిన తర్వాతే ఆ ప్రకటనలను ప్రచురించాల్సి ఉంటుంది.

ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి ..

అన్ని రకాల టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా పంపే ఎస్ఎంఎస్, వాయిస్ మెసెజ్‌లు ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, గుగూల్ వెబ్‌సైట్స్ వంటివి సామాజిక మాధ్యమాలు కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయి. సినిమా హాళ్లలో, ప్రైవేటు ఎఫ్ఎం రేడియోలలో, ఎలక్ట్రానిక్ పత్రికల్లో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలకు కూడా ముందస్తు ధృవీకరణ తప్పనిసరి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంసీఎంసీ టెలికాస్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాతే ప్రచారం చేపట్టాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ప్రకటనలు ఎందులో ఇవ్వదలుచుకున్నారో ఆ మేరకు సీడీలో వీడియో, ఆడియో రికార్డు చేసుకుని ప్రకటన టైటిల్, ప్రకటన తయారీకి అయిన ఖర్చు, ప్రకటనలు ఇచ్చేందుకు అయ్యే ఖర్చు వంటివి సూచిస్తూ దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లోని ఎంసీఎంసీ కమిటీకి రెండు సెట్ల దరఖాస్తు ఇవ్వాలి. సర్టిఫికెట్ లేని ఎన్నికల ప్రకటనలు ఎవరూ ప్రదర్శించడానికి వీలు లేదు. అనుమతి పొందిన ఆర్డర్ నెంబరును సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుంది. ఎంసీఎంసీ అనుమతి లేకుండా జరిగే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల కింద పరిగణిస్తారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వీటిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి సూచిస్తున్నారు.

249 ఫిర్యాదులకు పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 251 ఫిర్యాదులు అందగా 249 ఫిర్యాదులకు పరిష్కారం చూపామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ్ రామరాజు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేయడం జరిగిందన్నారు. మొత్తం 251 ఫిర్యాదులు అందగా 249 ఫిర్యాదులకు పరిష్కారం చూపగా, రెండు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.43,67,740 ల మేర నగదు, రూ.51,81,707 ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేయడం జరిగింది. అలాగే 138 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామన్నారు.

గాయపడిన విద్యార్థి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. రైల్వేకోడూరు మండలంలోని మారావారిపల్లి ప్రధాన రహదారిపై ఈనెల 26వ తేదిన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థులను ఆర్టీసీ బస్సు ఢీ కొన్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ శెట్టిగుంట పెద్దపాడు గ్రామానికి చెందిన షాహిల్ (16) అనే విద్యార్థి గురువారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు సీఐ బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ



హాజరైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెచ్‌ఎంలు, మెడికల్ ఉద్యోగులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కడపలోని మండల వనరుల కేంద్రంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి అధ్యక్షతన సహిత విద్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అంగన్‌వాడీ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులనుద్దేశించి వారు మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల దయతో, జాలితో వ్యవహరించి వారిని సమీపంలోని పాఠశాలలో చేర్పించాలన్నారు. వారికి అవసరమైన నైపుణ్యాలను అందించడంతోపాటు ప్రభుత్వం తరుపున అందాల్సిన సహాయ సహకారాలు అందే విధంగా తోడ్పాటు అందించాలన్నారు. విజన్ 2025లో భాగంగా ప్రతి ఒక్క విద్యార్థికి డిజిటల్ పరిజ్ఞానాన్ని అందించాలని కోరారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. మెడికల్ డిపార్ట్‌మెంట్ వారు దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఆరోగ్య సౌకర్యాలతోపాటు తగిన సూచనలు, సలహాలను అందించాలన్నారు. అనంతరం రిమ్స్ వైద్యులు విష్ణువదన, ఫక్రుద్దీన్, రీసోర్సు పర్సన్స్ శివభవర్‌రెడ్డి, బలరామిరెడ్డి, గంగులప్ప, విజయమ్మ, రవి కుమార్‌లు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించిన చట్టాలను, వారికి అందాల్సిన పథకాల గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాలెం నారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెచ్‌ఎంలు, సంక్షేమ పాఠశాలల హెచ్‌ఎంలు, మెడికల్ డిపార్టుమెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎడ్లు

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో శ్రీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరి వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 12 జతల ఎద్దులు పాల్గొనగా వాటిలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు వరుసగా రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు బహుమతులు అందజేశారు. కమిటీ సభ్యులు బాబురెడ్డి, బి.చెన్నారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పోచ్చిరెడ్డి పాల్గొన్నారు.